

వైభవం.. అంకాలమ్మ బ్రహ్మోత్సవం

బి.కోడూరు మండలంలోని రాజుపాళెంలో గల పల్నాటి అంకాలమ్మ దేవత బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. -10లో



సమాజ సేవే ముఖ్యం

భారతి సిమెంటు పరిశ్రమ సమాజ సేవలో ముందుందని ఆ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/28.6

జిల్లాలో శుక్రవారం 28.6 - 39.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ల ఫలితాల విడుదల



పరీక్షా పత్రాలు విడుదల చేస్తున్న వైవీయూ అధికారులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (3,5 సంవత్సరాల), 3 5, 7, 9 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, అకడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబులరెడ్డి శుక్రవారం పరిపాలన భవనంలో విడుదల చేశారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ 81 శాతం, ఐదో సెమిస్టర్ 76, ఏడో సెమిస్టర్ 61, తొమ్మిదో సెమిస్టర్‌లో 91.67 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎల్ఎల్‌బీ మూడు సంవత్సరాల కోర్సు 3వ సెమిస్టర్ లో 23.81 శాతం, 5వ సెమిస్టర్‌లో 88.24 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగాన్ని రిజిస్ట్రార్ అభినందించారు.

శాంతియుతంగా బక్రీద్‌ను జరుపుకోండి



జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: మత సామరస్యానికి ప్రతీకైన వైఎస్సార్ కడప జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో, సుఖశాంతులతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ సూచించారు. సమైక్యత, సమానత్వాన్ని పెంపొందిస్తూ త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లింలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎస్పీ శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పండుగ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తినట్లు తెలిపారు. పోలీస్ పికెట్లు, చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ పార్టీలు, స్పెషల్ పార్టీ, బ్లూకోల్ట్స్ సిబ్బందితో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పుకార్లు, సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ఫిర్యాదు కానీ, ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా డయల్ 100కి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని వివరించారు.

పాలన.. దూరమైతే వేదన

- వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ స్వరాజ్యం
- సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు
- ఇంటి ముంగిటకే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- జగన్ ముద్ర చెరిపేసేందుకు కూటమి కుట్ర
- ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థకు మంగళం
- సచివాలయాల ఎత్తివేతకు పన్నాగం
- పేదల సంక్షేమంపై నీలినీడలు



కడప సెవెన్‌రోడ్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టింది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసింది. పాలనను ప్రజల ఇంటి ముగింటకు చేర్చింది. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు ఉంటే.. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముద్ర చిరస్థాయిగా ఉంటుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఎలాగైనా ఆ ముద్ర చెరిపేయాలని కుట్ర పన్నుతోంది. ఇందుకోసం ఏకంగా ఆ వ్యవస్థల ఎత్తివేత దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడింది. సచివాలయ వ్యవస్థను క్రమేణా కనుమరుగు చేయాలని చూస్తోంది. దీంతో చెంతకు చేరువైన పాలన మళ్లీక్కడ దూరమవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విప్లవాత్మక మార్పు

ఎన్‌టీ రామారావు మండల వ్యవస్థను తీసుకురావడం ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేశారు. అప్పట్లో అది ఓ విప్లవాత్మకమైన మార్పు. దానికొనసాగింపుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి.. ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన తీసుకు రావడం ద్వారా ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలిచారు. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటి తలుపు తట్టాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవస్థ ప్రజలకు తప్పింది. ఏ చిన్న పనైనా వలంటీర్‌కు చెబితే ఇట్టే పరిష్కారమయ్యేది. మైఖేల్ క్రిమేర్, ఫ్రెంచ్-అమెరికన్ ఎకానమిస్ట్ ఈస్తర్ డఫ్లో వంటి నోబెల్ బహుమతి గ్రహీతలు సైతం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాల తీరును పరిశీలించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం, మహిళా సాధికారత తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశంసించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడమే కాకుండా సచివాలయాలను కనుమరుగు చేసే చర్యలకు పాల్పడుతోంది.

బాపూజీ కల సాకారం దిశగా...

మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాకారం కోసం 2020 అక్టోబరు 2వ తేదీన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రస్తుత వైఎస్సార్ కడప జిల్లాలో 423 గ్రామ సచివాయాలు, 226 వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వివిధ శాఖలకు చెందిన 536 రకాల ప్రభుత్వ సేవలు సచివాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో అత్యధిక సేవలు కేవలం 15 నిమిషాల నుంచి 72 గంటల్లోనే ప్రజలకు అందేవి. ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించారు. వీరికి ప్రతి నెల రూ.5 వేల గౌరవ వేతనం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పెన్షన్లు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, లా నేస్తం, చేదోడు, చేయూత, ఈబీసీ నేస్తం, ఎకనమికల్లీ వీకర్ సెక్షన్స్‌కు సంబంధించిన సాయం, వివాహ రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఆధార్ అప్‌డేషన్, ఇసుక బుకింగ్ వంటి అనేక సేవలు ప్రజలకు అందజేయడంలో వలంటీర్లు ఎంతో కీలకంగా పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని తీసుకొచ్చినా.. అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం మొదలు, వారితో దరఖాస్తు చేయించి లబ్ధి పొందేందుకు వలంటీర్లు ఎంతో సహకరించారు.

హామీ ఇచ్చి.. విస్మరించి..



2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అలాగే వలంటీర్లలో విద్యార్హతలను బట్టి తగిన నైపుణ్య శిక్షణ ఇప్పించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హత పొందేలా చర్యలు తీసుకుంటామంటూ ఊరూరా తిరిగి హామీలు ఇచ్చారు. అయితే 'ఏరు దాటేంత వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న..' అన్న చందంగా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థకే మంగళం పాడారు. పైగా ప్రజల్లో జగన్ చేసిన మంచి పనులను లేకుండా చేయడం ద్వారా ఆయన ముద్ర చెరిపివేసేందుకు సచివాలయ వ్యవస్థను భ్రష్టు పట్టించే చర్యలకు సిద్ధం కావడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వలంటీర్ల సేవలు అమూల్యం



సచివాలయ, వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దనే అందడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి తప్పిపోయింది. ఇందువల్ల తమ పనులు పోగొట్టుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. అలాగే అధికారులకు లంచాలు ఇచ్చే అవసరం తప్పింది. ప్రభుత్వం చేపట్టే ప్రతి ఇంటింటి సర్వే నిర్వహించడంలో వలంటీర్ల కృషి మరువలేనిది. ముఖ్యంగా కరోనా విజృంభించి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన సందర్భంలో కూడా.. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వేతోపాటు పెన్షన్లు, ప్రభుత్వ ఆర్థికసాయం, మాస్కులు, శానిటైజర్లు, మందులు వంటివి అందజేశారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు కరోనా అంటే వణికిపోయినా.. ఆ రోజుల్లో ఇంటింటికీ తిరిగి అమూల్యమైన సేవలు అందించారు. వలంటీర్ల సేవలను గుర్తించిన నాటి ప్రభుత్వం వారిని సత్కరించి గౌరవించింది.

బాబు మోసగించారు



తాను అధికారంలోకి రాగానే వలంటీర్లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఊరూరా తిరిగి మాకు హామీలు ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇచ్చిన హామీ అమలు చేయకుండా మాకు వెన్నుపోటు పొడిచారు.
- వంశీ, మాసాపేట, కడప

గతంలో ఇంటి ముంగిటకే సేవలు



సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందేవి. కరోనా సమయంలో కూడా ఇళ్ల వద్దకు వచ్చి సేవలు అందించడం ప్రశంసనీయం. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది.
- సుభాన్, కడప

ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం ఉండేది కాదు



గతంలో ఏదైనా చిన్న సర్టిఫికెట్, రేషన్ కార్డు కావాలన్నా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు సుపరిపాలన అందింది. చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను తొలగించడం తగదు.
- మహిత, బుడ్డాయపల్లె, కడప

పథకాలు ఇంటి వద్దకే వచ్చేవి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సచివాలయాల వ్యవస్థ వల్ల అనేక సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే అందాయి. బియ్యం కూడా ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు ఎండీయూ వాహనాలు తొలగించడం వల్ల ఎఫ్‌సీ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.
- సుధారాణి, రాజారెడ్డివీధి, కడప

లక్ష సౌర గృహాలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ అమర్చడమే లక్ష్యంగా పని చేయాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో బ్యాంకర్లు, అధికారులు, సంస్థాపన వెండర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు నిబంధనలు సులభతరం చేశామని, వీటిని ప్రజలకు తెలియజేసి అవగాహన పెంచాలన్నారు. సిబిల్ స్కోర్‌ను బట్టి బ్యాంకులు రుణాలు వేగ వంతం ఇస్తాయని తెలిపారు. ఒక్క కిలో వాట్ కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్తు, రెండు కిలోవాట్ల కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుందన్నారు. వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పొంది సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకర్స్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.జనార్దన్, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్, హరిసేవ్య నాయక్, భరణి క్రిష్ణ, ప్రసాద్‌రెడ్డి, డీఈఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష



కేఎస్ఆర్ఎం కళాశాలలో పరీక్ష రాయడానికి వెళ్తున్న అభ్యర్థులు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష శుక్రవారం జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైంది. డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులంతా నిర్ణత సమయానికంటే గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. వారిని అధికారులు కేంద్రం వెలుపలనే క్షుణంగా తనిఖీ చేశారు. ఒరిజినల్ హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులను పరిశీలించన తర్వాతే లోపలికి అనుమతించారు. మొదటి రోజు కడప, ప్రొద్దుటూరు కేంద్రాలలో ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌కు సంబంధించి 1781 మంది అభ్యర్థులకు గాను 1584 మంది హాజరు కాగా 197 మంది గైర్హాజరైనట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఉదయం కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం, అన్నమాచార్య, స్విస్ట్‌లతో పాటు ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 936 మంది అభ్యర్థులకు గాను 862 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం కడపలో అన్నమాచార్య, కేఓఆర్ఎం, కేఎల్ఎంతోపాటు ప్రొద్దుటూరులో సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 845 మంది అభ్యర్థులకు గాను 722 మంది హాజరు కాగా 123 మంది గైర్హాజరయ్యారు. ఆయా కేంద్రాలకు కేటాయించిన డిప్యూటీ కలెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు. డీఈఓ షేక్ షంషుద్దీన్ కడపలోని కేఎస్ఆర్ఎంతో పాటు స్విస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేశారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తలేదని డీఈఓ తెలిపారు.

ఏషియన్ తైక్వాండో పోటీలకు ఎంపికలు

పోరుమామిళ్ల: 3వ ఏషియన్ యూత్ గేమ్స్‌కు సంబంధించి తైక్వాండో ఓపెన్ సెలక్షన్స్ ట్రయల్స్ ఈ నెల 9,10,11 తేదీల్లో నాసిక్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా తైక్వాండో ఇన్‌చార్జి గురుస్వామి, తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మునీశ్వర్ తెలిపారు. స్థానికంగా వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బహ్రెయిన్ దేశంలో 3వ ఏషియన్ యూత్ గేమ్స్ అక్టోబర్ 22 నుంచి 31 వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులను ఎంపిక చేసేందుకు నాసిక్‌లోని డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇండియా తైక్వాండో జాతీయ సంఘం ఓపెన్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఈనెల 8వ తేదీ లోపల ఇండియా తైక్వాండో.కామ్ పోర్టల్ యుఐడి కోసం రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ పోటీలకు 15, 16 సంవత్సరాల బాల, బాలికలు మాత్రమే అర్హులన్నారు. మొత్తం 5 వెయిట్ కేటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికయిన క్రీడాకారులు బహ్రెయిన్‌లో జరిగే గేమ్స్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

అదును.. పదును

- జిల్లాలో కురుస్తున్న వర్షం
- లోతు దుక్కులతో భూసారం పెంపు
- చీడపీడలు, కలుపు మొక్కలకు చెక్
- భూగర్భ జలాల నిల్వకు అవకాశం



ట్రాక్టర్‌తో లోతు దుక్కులు చేస్తున్న రైతు

కడప అగ్రికల్చర్: ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి పంటల సాగులో రైతులకు కలుపు సమస్య దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కలుపు యాజమాన్య ప్రక్రియ వర్షం కురిసినప్పటి నుంచే చేపడితే ఉత్తమ ఫలితాలు వస్తాయి. వర్షం కురవగానే భూమిలోని కలుపునకు సంబంధించిన విత్తనాలన్నీ మొలకెత్తుతాయి. తక్షణం లోతు దుక్కులను చేపడితే చాలా మటుకు కలుపు మొక్కలను నివారించుకోవచ్చు. పంటల సాగు సమయానికి మీద మీద రెండు సార్లు దుక్కులు(సేద్యాలను) చేస్తే కలుపు మొక్కలు దాదాపు నివారించుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,28,084 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయ అధికారులు నిర్దేశించారు. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వాతావరణ మార్పుతో పాటు రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు కూడా ప్రారంభమయ్యాయి. ఇక ఆరుతడి పంటలైన సజ్జ, జొన్న, మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, పత్తి, వేరుశనగ, సన్‌ఫ్లవర్, సోయాబీన్ తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. మారిన వ్యవసాయ పద్ధతులతో వివిధ పంటల్లో కలుపు నివారించేందుకు రైతులు పలు రకాల మందులపై ఆధార పడుతున్నారు. విత్తనం వేశాక, పైరు పెరిగే దశలో మందుల వాడకంతో కలుపు నివారణ చేపడుతున్నారు. ఇలా కలుపు మందులను పిచికారి చేయడం ద్వారా భూమి సారవంతం కొంత దెబ్బతినే అవకాశం ఉంటుంది. కలుపు మందులపై ఆధార పడే ముందు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పంటల నూర్పిడి తరువాత..

పంటల నూర్పిడి తరువాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు చాలా మంది రైతులు భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తారు. దీంతో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. కావున ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో రైతులు పంటలు సాగు చేసుకునే సమయానికి లోతు దుక్కులను చేపడితే బోలెడు లాభాలు ఉన్నాయి. లోతు దక్కులు చేయడం వల్ల భూమి పైపొరలు కిందకి, కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. అలాగే లోతు దుక్కలను చేపట్టడం వల్ల భూమిలో ఉండే పురుగులు, కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. వేసవిలో చాలా మంది రైతులు పశువులు, ఆవులు, గొర్రెల పెంట, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం చేస్తారు. ప్రస్తుతం దున్నుతున్న దుక్కులతో అవన్నీ భూమిలో కలిసిపోయి భూమి సారవంతంగా మారుతుంది. దీంతోపాటు భూమి ఎక్కువకాలం తేమను కలిగి ఉంటుంది.

పంటలు లేనప్పుడే..



లోతు దుక్కి చేసిన పొలం

వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగు లు పంట కోత దశల్లో వాటి నిద్రావస్థ దశలో.. నేల, చెత్తాచెదారం, కోయ కాడల్లో ఎక్కువకాలం గడపుతాయి. అలాగే తెగుళ్లను కలుగ చేసే శిలీంద్రా లు భూమి లోపల ఆశ్రయం పొందుతా యి. వీటి శిలీంద్ర బీజాలు భూ మిలో నిల్వ ఉంటాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో లోతు దుక్కల వల్ల నిద్రావస్థ దశలో భూమిలోని చీడ పురుగు కోశా లు, గుడ్లు, లార్వాలు పక్షు లు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. దీంతోపాటు కలుపునకు సంబంధించిన విత్తనాలు కూడా చనిపోతాయి.

ప్రస్తుతం కురుస్తున్న వానతో..



ప్రస్తుతం కురుస్తున్న వానలను రైతులు సద్వినియోగం చేసుకుని మాగాణి, మెట్ట, బీడు భూములను దున్నుకోవాలి. ముఖ్యంగా దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలు, అడ్డం దున్నడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. సాధారణంగా రైతులు పంట చేతికి రాగానే.. పంట నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్తా చెదారం కాల్చివేయకుండా అలాగే వదిలేసి ఉంటారు. ఈ వర్షంతో లోతు దుక్కులు చేయడంతో నేలల్లో కలిసి పోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. లోతు దుక్కలు చేయడం వల్ల కలుపు నివారణ మొక్కలు కూడా నశించిపోతాయి.

రైతులు లోతు దక్కులు చేపట్టాలి



ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షం పదునుతో రైతులు తమ బీడు భూములను లోతుగా దక్కులు చేసుకోవాలి. దీంతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుంది. లోతు దుక్కులతో భూమిలో ఉన్న చీడపీడలతోపాటు కలుపు నివారణతో నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. దీంతోపాటు భూమిలో తేమ శాతం పెరుగుతుంది.
- అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

చీనీ చెట్ల నరికివేత



నరికేసిన చెట్లు

కొండాపురం : మండలంలోని యనమలచింతల గ్రామానికి చెందిన మండ్ల ప్రసాద్ చీనీ తోటలో గుర్తుతెలియని వ్యక్తులు 41 చెట్లు శుక్రవారం నరికేశారని తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండ్ల ప్రసాద్ చీనీ తోటలో 130 చీనీ మొక్కలు ఉన్నాయని, వాటిలో 41 మొక్కలను గురువారం నరికినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని సందర్శించి రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని దువ్వూరు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన మేరకు.. గంజాయి విక్రయిస్తున్నారని సమాచారంతో ప్రొద్దుటూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీవీ.సురేంద్రరెడ్డి, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నీలకంఠేశ్వరరెడ్డి, సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడిలో హుస్సేన్ బాషా, సంతోష్, కార్తీక్‌లను అరెస్టు చేసి వారి నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వైభవం.. పల్నాటి అంకాలమ్మ బ్రహ్మోత్సవం



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కంప తొక్కేందుకు వచ్చిన భక్తులు

బి.కోడూరు : మండలంలోని రాజుపాళెంలో గల పల్నాటి అంకాలమ్మ దేవత బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చివరి ఘట్టమైన శుక్రవారం కంప తొక్కే కార్యక్రమాన్ని మహిళలు, భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి దంపతులు హాజరై పూజలు జరిపారు. అనంతరం వారు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. డీసీ.గోవిందరెడ్డి మాట్లాడుతూ తిరునాలను భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారని, ముళ్ల కంపలపై నడవడం విశేషంగా ఉంటుందని తెలిపారు. పవిత్ర కార్యక్రమాలను జరుపుకోవడం ఎంతో ఆనందమన్నారు. అనంతరం బండలాగుడు పోటీలను బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్ రెడ్డి, డీసీసీ బ్యాంకు చైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. విజేతలకు వారు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఓబుళరెడ్డి వెంకటరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కొండా వెంకటరామిరెడ్డి, కొండా రమణారెడ్డి, దేవినేని సుబ్బరామిరెడ్డి, కొండా వెంకటసుబ్బారెడ్డి, బోరెడ్డిచెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట చీటింగ్

న్యాయం చేయాలి బాధితుల ఆవేదన

కడప అర్బన్ : ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సొమ్ము తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు దేరంగుల సులోచన, భర్త నరేష్, దేరంగుల అనులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నిందితులైన గిద్దలూరు సుబ్బరాయుడు, అతడి భార్య ఉమామహేశ్వరిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరిపై కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు తెలిపారు. బాధితుల వివరాల మేరకు.. అక్కా చెల్లెళ్లయిన తాము నర్సింగ్ కోర్సు పూర్తి చేశామని, కరోనా సమయంలో రిమ్స్‌లో తాత్కాలిక నర్సులుగా పనిచేశామని దేరంగుల సులోచన, ఆమె అక్క అనులు తెలిపారు. ఆ సమయంలో కడప రిమ్స్ హాస్పిటల్ నందు నర్స్‌గా పని చేసే ఉమామహేశ్వరి పరిచయం అయిందన్నారు. తన భర్త గిద్దలూరు సుబ్బరాయుడుకు కడప రిమ్స్ హాస్పిటల్‌లో అధికారులు పరిచయం ఉన్నారని, పర్మినెంట్ నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఉమామహేశ్వరి చెప్పిందన్నారు. ఇందుకోసం తాను తన అక్కఇద్దరు కలిసి తమ దగ్గరికి వచ్చి ఒకరు రూ.1,80,000, మరొకరు రూ.1.25,000 తమ దగ్గరి నుంచి తీసుకున్నారన్నారు. ఆ తరువాత ఉద్యోగం ఇప్పించకుండా..డబ్బు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. గట్టిగా అడిగితే మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోమంటే బెదిరిస్తున్నారన్నారు. వారిద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

బ్రాహ్మణ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో చేరండి



పీవీఎస్వీ.ప్రసాదరావు

వేంపల్లె : ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో బ్రాహ్మణులందరూ సభ్యులుగా చేరాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీఎస్వీ.ప్రసాదరావు ఓ ప్రకటనలో కోరారు. వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరి ముగ్గురితో గ్రూపు ఉంటే తక్కువ వడ్డీకి రుణాలు మంజూరుచేస్తారన్నారు. వ్యక్తిగత రుణాలు తీసుకునే అవకాశం ఉందని, వ్యాపారం కోసం మొదట్లో రూ.2 లక్షలు రుణం పొందవచ్చునన్నారు. 18-60 ఏళ్ల లోపు బ్రాహ్మణులందరూ సభ్యత్వం పొందవచ్చునన్నారు.ఈ అవకాశాన్ని అర్హులైన బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డీమ్డ్ యూనివర్శిటీగా ఆదిశంకర



మాట్లాడుతున్న ఆదిశంకర అధినేత వంకి పెంచలయ్య

నెల్లూరు (టౌన్) : ఆదిశంకర గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు డీమ్డ్ యూనివర్శిటీగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు లభించిందని ఆ విద్యా సంస్థల గ్రూపు చైర్మన్ వంకిపెంచలయ్య తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్‌లో డీమ్డ్ యూనివర్శిటీ లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయలసీమ జోన్‌లో డీమ్డ్ యూనివర్శిటీగా గుర్తింపు పొందింది కేవలం ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల మాత్రమేనని చెప్పారు. 2001లో కేవలం 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఇంజినీరింగ్ కళాశాల నేడు 8వేల మంది విద్యార్థులతో ఉందన్నారు. కోవూరు సమీపంలోని రామన్నపాలెం వద్ద కొత్తగా ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలను 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మధ్వాచార్య, ప్రొఫెసర్లు వేణు మాధవ్, ధనుంజయ, ఏఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పది మూల్యాంకనంలో నిర్లక్ష్యం

రాయచోటి జగదాంబసెంటర్ : పదో తరగతి ఫలితాల మూల్యాంకనంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర చక్రధర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్‌దాస్ అన్నారు. మంత్రి లోకేష్ రాజీనామా కోరుతూ డీఈఓ సుబ్రహ్మణ్యంను శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మందికి పైగా విద్యార్థులు మానసిక ఆందోళనకు గురయ్యారని, మూల్యాంకనంలో లోపాలతో అనుత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ మార్కుల జాబితాపై అనుమానంతో ఉన్నారని, రీవాల్యుయేషన్‌కు ఎలాంటి ఫీజు లేకుండా అవకాశం కల్పించాలన్నారు. తుది ఫలితాలు వచ్చే వరకూ పది మార్కుల ఆధారంగా జరిగే అడ్మిషన్లను నిలిపివేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వర్‌రెడ్డి, మణికంఠారెడ్డి, యూసఫ్‌ఖాన్, లోకనాథం, శివకుమార్, మొఘల్ ఫైజాన్‌బేగ్, సయ్యద్ ఫైజాన్, జగదీష్, షేక్ ఒబైజ్, షేక్ మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

13న వెలిగల్లు ఉద్యానవనంలో యోగాంధ్ర



వెలిగల్లు ఉద్యాన వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : ఈ నెల 13న వెలిగల్లు ఉద్యానవనంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం, టూరిజం అధికారి నాగభూషణం తెలిపారు. మండల ఎంపీడీఓ జవహర్‌బాబుతో కలసి గాలివీడు మండలంలోని వెలిగల్లు ఉద్యానవన స్థలాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ యోగా ద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రశాంతంగా జీవించగలరని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ హరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

మహల్‌లో బ్యానర్లకు చిచ్చు

కలికిరి : మండలంలోని గుండ్లూరులో వెలసిన మూలస్థానమ్మ తిరునాల ప్రారంభం కానున్న నేపథ్యంలో అద్దవారిపల్లి పంచాయతీ పరిధిలోని మహల్ యర్రదొడ్డిపల్లి వైఎస్సార్‌సీపీ యువత బ్యానర్ ఏర్పాటుచేశారు. ఇది ఓర్వలేని టీడీపీ నాయకుడైన సతీష్‌రెడ్డి అనుచరుడు హరీష్ శుక్రవారం మధ్యాహ్నం 1.50గంటల సమయంలో తన వెంట తెచ్చుకున్న పెట్రోలు బ్యానర్‌పై పోసి నిప్పంటించాడు. స్థానిక సీసీ కెమెరాల్లో రికార్డవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రిజ్వాన్, యువత పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఏర్పాటు చేసిన గుండ్లూరు మూలస్థానమ్మ జాతర బ్యానర్‌పై పెట్రోలు నిప్పటించడం హేయమైన చర్య అని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

మోటార్ బైక్ దగ్ధం



దగ్ధమవుతున్న బైక్

వేంపల్లె : మంటలు చెలరేగి ఆటో రిక్షా అమర్చిన మోటార్ బైక్ దగ్ధమైంది. వేంపల్లెకు చెందిన రహంతుల్లా మోటార్ బైక్‌కు రిక్షా బిగించుకుని మూటలు మోస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి పులివెందుల రోడ్డులోని టీఎంఆర్ సూపర్‌మార్కెట్ వద్ద వాహనాన్ని నిలిపి ఉండగా, ఒక్కసారిగా మోటార్ బైక్‌లో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుప్రక్కల వారు మంటలను అదుపుచేసేందుకు నీటిని చల్లడంతో ఆటో రిక్షా కాలిపోలేదు. అయితే అప్పటికే మోటార్ బైక్‌కాలిపోయింది. కూలి పనులు చేసుకునే తనకు మోటార్ బైక్ తెచ్చుకునే స్థోమత లేదని, ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని శివాలయం సెంటర్ సమీపంలోని మైదుకూరు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. అతను శుక్రవారం రోడ్డుపై పడిపోయి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎస్ఐ ఆరా తీశారు. అతడికి సంబంధించిన వివరాలు లభించకపోవడంతో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 35ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మద్యం మత్తులో డీ హైడ్రేషన్ కారణంగా అతను చనిపోయి ఉంటాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులుంటే టూ టౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

విద్యార్థిని అదృశ్యం

బి.కొత్తకోట : స్థానిక జయశ్రీ కాలనీ చెందిన విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. 19 ఏళ్ల విద్యార్థిని బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 4న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా.. ఇంట్లో ఉన్న విద్యార్థిని కనిపించలేదు. ఆచూకీ కోసం గాలించినా కనిపించలేదు. దీంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్

రాజంపేట : రాజంపేట -రాయచోటి ఘాట్ రోడ్డులోని ఎస్ఆర్‌పాలెం సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ నాగరాజు(40) దుర్మరణం చెందారు. మృతుడు రాజంపేట పట్టణంలోని సుద్దగుంతలకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆటో నడుపుకొని జీవిస్తున్న కుటుంబం ఇప్పుడు పెద్దదిక్కును కోల్పోయి కన్నీటిపర్యంతమవుతోంది. ఆటోను ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ ఢీకొందని, కేసుపై పోలీసులపై ఒత్తిడి పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నమయ్య సామిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాజంపేట రూరల్ : నందలూరు మండలం ఎర్రిపాపయ్యగారిపల్లికి చెందిన పీ.హరికృష్ణ జీవనోపాధి కోసం డివిజనల్ సబ్ స్టేషన్ సమీపంలో సామిల్లు నడుపుకొంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఉన్నపాటుగా మిల్లులో మంటలు చెలరేగి కొయ్యలు దగ్ధమయ్యాయి. రాజంపేట అగ్నిమాపక అధికారి కే.మాబు సుభాన్, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. జిల్లా అగ్నిమాపక అధికారి సునీల్‌కుమార్ శుక్రవారం ఆ స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారాణాలను ఆరా తీశారు.

పాత కక్షలతోనే ఆంజనేయులు హత్య

ముగ్గురు నిందితుల అరెస్టు



హత్య వివరాలు తెలియజేస్తున్న సీఐ చల్లని దొర

వీరపునాయునిపల్లె : పాత కక్షలతోనే అనిమెల ఆంజనేయులు హత్య జరిగిందని, ఆ కేసులో నిందితులను గురువారం సాయంత్రం అరెస్టు చేశామని పెండ్లిమర్రి సీఐ చల్లనిదొర తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వీరపునాయునిపల్లెకు చెందిన బెలుకూరు నవీన్, నరేష్‌లకు ఇంటి వద్ద గత పదేళ్లుగా తగాదా ఉండేదన్నారు. 2014లో అదే గ్రామానికి చెందిన బోగాధి చీనీ, నిమ్మ చెట్లను ఆంజనేయులు నరికి వేయగా, దీనిపై కేసు నమోదైందన్నారు. ఇటీవల నరేష్ కుటుంబీకులను ఆంజనేయులు బెదిరించడంతో అతడితోపాటు నవీన్, బోగాధి కలిసి ఆంజనేయులను హత్య చేయాలని భావించారు. బెలుకూరి రెడ్డి మహేష్ ఆంజనేయులు ఇంటికి వస్తున్న సమాచారాన్ని అందించాడు. దీంతో గత నెల 27న ఆంజనేయులు ఇంటికి వెళ్తుండగా.. కాపుకాసి రోకలిబండతో కొట్టి, పిడి బాకులతో పొడిచి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. గురువారం సాయంత్రం 6.03 గంటలకు నిందితులను అదుపులోకి తీసుకొని నేరానికి ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్ర వారం కమలాపురం కోర్టులో హాజరుపరచినట్లు తెలియజేశారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి



అనంతపురం రైల్వే స్టేషన్‌లో సంజీవరాయుడు

అనంతపురం సిటీ : అనంతపురం రైల్వే స్టేషన్‌లో కదిలే రైలు ఎక్కబోయి.. ప్రమాదవశాత్తూ అదుపు తప్పి పడిపోయిన దూదేకుల సంజీవరాయుడు(60) మరణించినట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. సంజీవరాయుడుకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ఎర్రగుంట్లలోని చిన్న కొడుకు వద్ద ఉంటున్న రాయుడు హోటల్‌లో పనిచేసుకుంటూ కాలం వెళ్లదీసేవాడు. తాగుడు అలవాటు ఉన్న రాయుడు.. యథావిధిగా హోటల్‌లో పని ముగించుకొని.. మందుకొట్టి గురువారం రాత్రికి వెళ్లాడు. దీంతో చిన్న కొడుకు తిట్టడంతో మనస్తాపానికి గురైన రాయుడు రాత్రికి ఇంటి నుంచి వచ్చేసి ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లోనే పడుకున్నాడు. శుక్రవారం ఉదయమే మచిలీపట్నం -ధర్మవరం రైలెక్కి వచ్చేశాడు. రైలు అనంతపురం చేరుకోగానే నీళ్ల కోసం దిగిన రాయుడు.. రైలు కదులుతుండడం చూసి ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించారు.

సమాజ సేవే ముఖ్యం

భారతి సిమెంట్ సీఎంఓ సాయి రమేష్



డ్రైవర్లతో పరిశ్రమ ప్రతినిధులు

కమలాపురం : తమ పరిశ్రమ కేవలం వ్యాపారం మాత్రమే చేయడంలేదని, దాంతోపాటు సమాజ సేవలో ముందుందని భారతి సిమెంట్ కార్పోరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. స్థానిక క్రాస్ రోడ్డు వద్దగల ఆర్‌సీఎం ఆసుపత్రి భవనంలో పలువురికి శిక్షణ సర్టిఫికెట్లు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీసీపీఎల్ ఆర్థిక సహకారంతో సంభవ్ ఫౌండేషన్ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల పేదలకు ఆర్‌టీసీ ద్వారా ఉచితంగా 32 రోజుల శిక్షణ ఇచ్చి హెవీ లైసెన్స్ ఇప్పించారన్నారు. ఇప్పటికే పలు చోట బస్ షెల్టర్లు, నీటి శుద్ధి కేంద్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డయాలసిస్, హిమో డయాలసిస్ సెంటర్లు, మరుగుదొడ్లు ఏర్పాటుచేశామన్నారు. దత్తత గ్రామాల పాఠశాలల్లో ఫర్నిచర్‌తోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. ప్రస్తుతం డ్రైవర్లకు శిక్షణ నిచ్చి హెవీ లైసెన్స్ ఇప్పించడంతోపాటు ఆర్టీసీలోనే ఉపాధి కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ చీఫ్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి, పేర్ల భార్గవ్ రెడ్డి, సీఎస్ఆర్ చీఫ్ నీతేశ్వర్, ఫౌండేషన్ జీఎం గిరిధర్ రెడ్డి, ఆర్టీసీ ట్రైనర్ జబ్బార్ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరికి వేలాడుతూ వివాహిత మృతి

అత్త, భర్త వేధింపులతోనే చనిపోయిందని తల్లిదండ్రుల ఫిర్యాదు



తేజశ్రీ (ఫైల్)

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఉరికి వేలాడుతూ అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో వెలుగుచూసింది. బాధితుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, బికేపల్లి కాలనీకి చెందిన శివకేశవ, రెడ్డమ్మ దంపతుల కుమార్తె తేజశ్రీ (23)ను మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లి చౌడేశ్వరీనగర్‌కు చెందిన రఘుకు ఇచ్చి రెండేళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి ఏడాది కుమారుడు ఆదిత్య ఉన్నాడు. రఘు చేనేత చీరలకు రంగులద్దుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా రఘు మద్యానికి బానిస కావడంతో భార్యా, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. అదనపు కట్నం తేవాలని, మనుమడు తేజశ్రీకి ఆభరణాలు చేయించాలని కొంతకాలంగా కోడలు అత్త చల్లమ్మ వేధిస్తోంది. ఈ క్రమంలో రఘు స్వగ్రామం తమిళనాడు రాష్ట్రం సేలంలో జాతరకు వెళ్లాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. గురువారం రాత్రి పొద్దుపోయినా రఘు ఇంటికి రాకపోవడంతో తేజశ్రీ భర్తకు ఫోన్ చేసింది. జాతరకు బయలుదేరాలి కదా.. త్వరగా ఇంటికి రమ్మని చెప్పింది. అయితే తనకు పని ఉందని, వేరే చోట పార్టీ ఉందంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన తేజశ్రీ ఇంట్లో తలుపునకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బిడ్డ ఆదిత్య ఏడుపు విన్న స్థానికులు తలుపు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అల్లుడి ఇంటి వద్దకు చేరుకున్న తేజశ్రీ తల్లిదండ్రులు విషయం తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లగా అప్పటికే కుమార్తె మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించడంతో కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చే గదికి తరలించారు. తమ కుమార్తె మృతికి భర్త, అత్త వేధింపులే కారణమని, ఒంటిపై గాయాలున్నాయని, అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తండ్రి శివకేశవ, టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



తమ తండ్రి ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్న కుమారుడు

ఓబులవారిపల్లె : నగలు అమ్మి వైద్యం చేయించినా నయం కాకపోవడంతో ఆ కుటుంబం అల్లాడిపోతోంది. లక్షల రూపాయలు చికిత్సకు ఇంకా కావాలని చెప్పడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. మండలంలోని చిన్నఓరంపాడు దళితవాడ గ్రామానికి చెందిన కోటపాడి ఉమామహేశ్వరరావు పెగలూరు మండల మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉమామహేశ్వరరావుకు భార్య ఉమాకుమారి, ఇద్దరు కుమారులు జతిన్‌కుమార్, గణపతి ఉన్నారు. వీరు రైల్వేకోడూరులోని అద్దె ఇంటిలో కాపురం ఉంటున్నారు. ఉమా కుమారి కుట్టు మిషన్ కుడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు తిరుపతి ఆసుపత్రిలో చేర్పించారు. శరీరంలోని అవయవాలు పనిచేయడం లేదని.. చెప్పడంతో చికిత్స కోసం దాదాపు పది లక్షల రూపాయలు బంగారు అమ్మి, అప్పు చేసి చెల్లించారు. ఇంకా లక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చి చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. భర్తకు వచ్చిన జీతాలు పోగా ఆస్తులు అమ్మి డబ్బు ఆసుపత్రికి కట్టినా ఇంకా నయం కాకపోవడంతో మరింత ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. దాతలు ఆర్థిక సహకారం అందించి తమ తండ్రి ప్రాణాలు కాపాడాలని కుమారులు కోరుకుంటున్నారు.

గుప్త నిధుల ముఠా విధ్వంసం

- హనుమాన్ విగ్రహం, ధ్వజ స్తంభం తొలగింపు
- సొరంగంలా తవ్వి వదలేసిన దుండగులు



సొరంగంలా తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు వ్యాసరాయసముద్రం చెరువు కట్టపై ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టి విధ్వంసం సృష్టించారు. నిమ్మకాయలతో మంత్రించిన అనంతరం క్షుద్ర పూజలు చేసి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని, బలమైన రాతి దూలాలు తొలగించారు. సొరంగాన్ని తలపించేలా లోతుగా తవ్వి ఆలయంబయట ధ్వజ స్తంభాన్ని పెకిలించారు. నిర్జన ప్రదేశంలో ఆలయాలు ఉండడంతో దుండగులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. చెరువు సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు, సర్పంచ్ రహ్మతుల్లా, సిబ్బంది ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కట్ట దిగువ ఉన్న పురాతన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ గత ఏడాది గోపురం, ధ్వజ స్తంభాలు పెకిలించారు. గుప్త నిధుల ముఠా సభ్యుల సంచారంపై పోలీసులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.